


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :111 | శుక్రవారం ఆగస్ట్ 14, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

## కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు






### ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి

### మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

పేజి 2లో ▶

## వివాదానికి ఇక ముగింపు పలకండి..

### మాల్యా, ఎస్‌బీఐకు బాంబే హైకోర్టు సూచన



- మాల్యా--ఎస్‌బీఐ వివాదానికి ముగింపు పలకండి: బాంబే హైకోర్టు
- పదేళ్లుగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం
- ఆచరణాత్మక పరిష్కారం దిశగా ముందుకెళ్లాలని సూచన
- ఈడీ జప్తు చేసిన ఆస్తులపై వివరాలు ఇవ్వాలని ఆదేశం
- మాల్యా కింగ్‌ఫిషర్ కోసం రూ.9,000 కోట్ల రుణం

2లో

## ఎర్రకోట బాంబు పేలుడు

# అల్-ఖైదా పనే..!



2లో

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

### పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు



**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టుస్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేజి 2లో ▶

# ఉచిత కుట్టుమిషన్లు..

## 15 నుంచి దరఖాస్తులు: మంత్రి పొన్నం



- బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు
- ఆగస్టు 15 నుంచి దరఖాస్తులు
- సెప్టెంబర్ 15 వరకు గడువు
- 1.19 లక్షల కుట్టుమిషన్ల పంపిణీ
- 119 నియోజకవర్గాల్లో ఒక్కో చోట 1,000
- ఒక్కో మిషన్ విలువ రూ.12 వేలు
- 100% సబ్సిడీపై అందజేత
- స్వయం ఉపాధికి ప్రోత్సాహం

2లో

## కర్నూలులో జగన్ పర్యటన.. 38 కి.మీ దూరానికి 5 గంటలు!



కర్నూలు: వైకాపా అధ్యక్షుడు జగన్ కర్నూలు జిల్లా జైలు వద్దకు చేరుకున్నారు. జైలులో ఉన్న ఆ పార్టీకి చెందిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఆయన పరామర్శించారు. పంచలింగాలలోని జిల్లా జైలు పరిసరాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వైకాపా కార్యకర్తలు వాటిని తోసుకుంటూ జైలు గేటు వరకు వెళ్లారు.

జగన్ పర్యటనలో ఎలాంటి రోడ్‌షోలకు కర్నూలు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి కర్నూలు జైలు వరకు 38 కి.మీ దూరం చేరుకోవడానికి జగన్ సుమారు 5 గంటల సమయం తీసుకున్నారు. వైకాపా కార్యకర్తలు భారీ ర్యాలీగా వచ్చి అడుగడుగునా పోలీసు ఆంక్షల్ని ఉల్లంఘించారు. బళ్లారి చౌరస్తాలో హైవేపై డీజే పెట్టి బైక్‌లతో హల్‌చల్ చేశారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



2లో



## సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

- ఏనుగుల సంరక్షణతో పాటు జీవనోపాధి
- ఏనుగులతో పంటనష్టం, ప్రాణనష్టంపై ఆందోళన
- కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్

ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు.

పేజి 2లో

## ఏనుగుల వల్ల జరిగే మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగాం: పవన్




- మానవ-ఏనుగు సంఘర్షణ మరణాలు 70% తగ్గింపు
- ఏనుగుల రిజర్వులు 26 నుంచి 33కు పెంపు
- 150 ఏనుగు కారిడార్లకు రక్షణ
- ఏపీలో 132--142 అడవి ఏనుగులు
- 4 కుంకీలతో ప్రత్యేక శిక్షణ కేంద్రం
- 50కి పైగా సంఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు
- 7 వన్యప్రాణుల అంబులెన్స్‌లు ఏర్పాటు
- 200కు పైగా వన్యప్రాణుల రక్షణ
- ప్రజల భాగస్వామ్యంతో ఏనుగుల సంరక్షణ: పవన్

2లో

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## జెన్‌జీ: కొత్త తరమా, పాత చట్రమా?

'జెన్ జీ' అన్నది ఇప్పుడు నూతన ఉత్సాహాన్ని గుర్తుకు తెచ్చే పదం. ఈ 'జెన్ జీ' తరానికి ఇప్పుడో హీరో వర్షిప్ ఏర్పడింది. ఈ తరం ముందు తరాల్లా కాదనీ; భిన్నమైన ఆలోచనలతో ప్రతిదాన్నీ ప్రశ్నించే తరమనీ అంతా చెప్పుకుంటున్నారు. ప్రతి ఉద్యమం ఏదో ఒక తాత్కాలిక లక్ష్యంతోనే మొదలవుతుంది. కానీ అది వదిలివెళ్లే పాదముద్రలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. మన స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని, చైనా సాంస్కృతిక విప్లవం దాకా ఎన్నో ఉద్యమాలు తాత్కాలిక విజయం కోసమే పని చేసినప్పటికీ, తదనంతరం ఆయా సమాజాల్లోని విలువలను ఎలా తలకిందులు చేశాయో చూశాం. ప్రతి ఉద్యమం తెచ్చే మార్పు ఆహ్వానించదగ్గదే. అయితే ఆ ఉద్యమం ప్రకటించిన భావనలు, విధానాలు, తీరుతెన్నులు... ప్రతి ఒక్కటీ సరైనదే అని మాత్రం చెప్పలేం. కార్పొరేట్ పరిభాషలో చెప్పాలంటే-- ప్రొడక్ట్ మంచిదే కావచ్చు, కానీ అది తయారు చేయడానికి వాడిన టెక్నాలజీ కలగజేసిన వాతావరణ కాలుష్యం, దాని పరిణామాలు కొంతకాలం తర్వాతే తెలుస్తాయి.

జెన్ జీ అన్నది నేటి యువతరానికి వాడుతున్న పర్యాయపదం. అంటే మానవ చరిత్రలో, పుట్టుకతోనే మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీని చూస్తూ వచ్చిన మొట్టమొదటి తరం. దీని ముందుతరం 'మిలీనియల్స్' (1981--96 మధ్యలో పుట్టినవాళ్లు). 'అనలాగ్', 'డిజిటల్' తరాన్ని ఒకేసారి చూస్తూ దానిని 'అడాప్ట్' చేసుకున్న మొదటి తరం ఈ మిలీనియల్స్. వీళ్లను సాధారణంగా 'అడాప్టబిలిటీ'కి ప్రతీకలుగా చూస్తారు. అంటే ఏ కొత్త మార్పుకైనా సులువుగా మారిపోతారు అని.

ఇంతకు ముందు కూడా యువతరాలు సమాజాన్ని ప్రశ్నించి ఉద్యమాలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. 'నవనిర్మాణ్ ఆందోళన్' అని గుజరాత్‌లో 1974లో హాస్టల్ మెస్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం చివరకు అక్కడి ముఖ్యమంత్రి రాజీనామాకు దారితీసింది. తమాషాగా అదే రాజకీయ నాయకుడు చిమన్‌భాయ్ పటేల్ సొంత పార్టీని స్థాపించి (కిసాన్ మజ్దూర్ లోక్ పక్ష్) 1975 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు, ఆపై 1990లో మళ్లీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. అది వేరే సంగతి. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి నడిపింది అప్పటి యువతరమైన విద్యార్థులే. రోహిత్ వేముల మరణాన్ని నిరసిస్తూ నడిచింది అప్పటి తరం విద్యార్థులే. ఇలా చరిత్ర చూస్తే, ప్రతి తరమూ తమ కాలంలో ఏవో ఉద్యమాలు చేసి సంచలనాలు సృష్టించినదే. ఆ యువత తర్వాత ఎదిగి మళ్లీ అవే సామాజిక దురాచారాలను వెంటవేసుకునే తరాల్లో కలిసిపోయింది. ఇది చరిత్ర చెప్పిన నిజం.

కాబట్టి ప్రస్తుతం 'జెన్ జీ'కి ఒక అసాధారణమైన హీరో వర్షిప్ కట్టబెట్టే ముందు ఆలోచించాల్సింది ఏమంటే-- ఈ తరం ఏ విలువలను ముందుకు తీసుకెళ్లగలుగుతుంది అన్నది. ఈ జెన్ జీ ఇంటికెళ్లాక మళ్లీ అదే 'ఎండోగమీ'లో పడిపోయి ఎవరి కులాల పిల్లలను వాళ్లు పెళ్లి చేసుకుని, తర్వాత ఆ కులాల్లోనే పిల్లల్ని కని, కంటిన్యూ చేయడమే జరుగుతుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే-- 'జెన్ జీ' అనేది ఒక హోమోజీనస్ గుంపు కాదు. దీనికి ఒక ఐడెంటిటీని ఆపాదించలేం. ఇది నిర్ద్వంద్వంగా 'హెటిరోజీనస్ గ్రూప్' (విభిన్నతల సమూహం). ఈ ఉద్యమంలో సినిమా పాటలకు డాన్స్‌లు వేస్తూ, చప్పట్లు కొడుతూ నాట్యాలు చేసే యువతను చూసినప్పుడు ఇది సమస్యపై తీవ్రంగా పోరాడే గుంపులా గాక, తమకుండే మూక బలాన్ని ఎంజాయ్ చేసే గుంపులా మాత్రమే కనిపించింది. ఆ వినోదం వాళ్లను ఒకటి చేసింది, వాళ్లంతా కలిసి ఒక సమస్యను ఎదుర్కొన్నారు. అది సంతోషదాయకమైన విషయం. కానీ ప్రతి ఉద్యమమూ ఒక దుఃఖ సన్నివేశం నుంచి పుడుతుంది. ఉద్యమ క్రమంలో ఆ భావావేశాన్ని వెనక్కు నెట్టివేయడం 'జెన్ జీ' ఏ కాదు, అది ఎవరు చేసినా అసంబద్ధమే.ఒక మూర్ఖత్వాన్ని

## ఎర్రకోట బాంబు పేలుడు

# అల్–ఖైదా పనే..!

మొదటి పేజీ తరువాయి

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబరులో జరిగిన పేలుడుకు అల్–ఖైదా అనుబంధ సంస్థ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ధ్రువీకరించింది. ఈ దాడితో 'అల్–ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ 'కు సంబంధం ఉందని పేర్కొంది. ఈ మేరకు దీనిపై నివేదిక విడుదల చేసింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

శిర్డీ సాయిపై దుష్ప్రచార వీడియోల వివాదం..

ఏక్యూఐఎస్ గతంలో చిన్న బృందంగా ఉండేదని.. ప్రస్తుతం ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా రూపాంతరం చెందుతోందని ఐరాస భద్రతా మండలి తన నివేదికలో తెలిపింది. అల్–ఖైదా, ఐసిస్ సంస్థలు రసాయన, జీవ ఆయుధాల తయారీపై చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంది. భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్‌ను స్థావరం చేసుకొని, అక్కడ తమ ముఠాలను బలోపేతం చేయడానికి ~~~~ తీవ్రంగా ప్రయత్నిస్తోంది వెల్లడించింది.

## సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి

విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం–2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ–ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయన్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏనుగుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఘర్షణలను తగ్గించడంలో ఏనుగుల ప్రవర్తనపై అధ్యయనానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏనుగుల మృతిని నివారించేందుకు రైల్వే శాఖతో సమన్వయంగా ప్రమాదకర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. విద్యుత్ లైన్ల కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు కొత్త ఏనుగు రిజర్వులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఘర్షణలకు ఒకే విధమైన పరిష్కారం ఉండదని, ప్రాంతాలవారీగా కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా ముందస్తు అంచనా ఆధారిత వ్యవస్థ అవసరమని చెప్పుకొచ్చారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సేకరించిన డేటా ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తిస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు. రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. ఏనుగుల సంరక్షణ, ఘర్షణల నివారణ కోసం రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా శాస్త్రీయ చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయవచ్చన్నారు. ఏనుగులు, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, కేంద్ర–రాష్ట్ర సమన్వయంతోనే దీర్ఘకాలిక పరిష్కారాలు సాధ్యమవుతాయని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

# ఉచిత కుట్టుమిషన్లు..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు.

బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## తెలంగాణను దోచుకోవడంలో

# బిఆర్ఎస్‌తో పోటీ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో

భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా–ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# వివాదానికి ఇక ముగింపు పలకండి..

మొదటి పేజీ తరువాయి

పరారీలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను "పరారైన ఆర్థిక నేరస్థుడి"(టబస్త్రఖ్‌అజవ వఏశీఅశీఎఅఏ శీటటవఅఎవతీ)గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే.. మాల్యా తొలుత భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే, బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు, మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్‌తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

మొదటి పేజీ తరువాయి

పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని రంగుల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తులం బంగారం ఇవ్వకపోగా పథకాన్ని కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన పథకాలను పూర్తిగా రూపుమాపే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నాటకాలకు తెరలేపుతోందని దుయ్యబట్టారు. 2014 నుంచి బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,

మైనారిటీ, ఈబీసీ వర్గాలకు రూ. 13 వేల కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచామని పేర్కొన్నారు. ?ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తును వీడి, వచ్చే విచారణ గడువైన సెప్టెంబరు 9 లోగా ఉన్నత న్యాయస్థానంలో బలమైన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్దిదారులకు వెంటనే నిధులు విడుదలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, చట్టసభల్లోనూ పోరాడుతుందని హెచ్చరించారు.

## రాజధానికి రాజమార్గం

# సీడ్ యాక్సెస్



మొదటి పేజీ తరువాయి

అమరావతి, మంగళగిరి–తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయని వివరించారు.

**కేంద్రానికి ధన్యవాదాలు**

190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. 2028 నాటికి దేశం మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. సింధూ నాగరికత తరహాలోనే నగరంలో సీడ్ యాక్సెస్ రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. రాజధాని ఆర్థిక రాజధానిగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.

**స్వర్ణాంధ్ర సాధన సంకల్పం**

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా మార్చాలన్నది తమ సంకల్పమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలంతా దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయాలని సూచించారు. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో తిరంగా ర్యాలీలను ప్రజా ఉద్యమంగా నిర్వహించాలని కోరారు.

**భవన సముదాయం పరిశీలన**

సభ అనంతరం రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని మంత్రి పొంగూరు నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి పరిశీలించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రజలంతా తమ వంతు కృషి చేయాలని, రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

## ఏనుగుల వల్ల జరిగే మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగాం: పవన్

మొదటి పేజీ తరువాయి

విశాఖపట్నం: ఏనుగులు.. అడవుల సంరక్షణ, జీవవైవిధ్యానికి కాపలాదారులు, దేశ వారసత్వానికి ప్రతీకలు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖలోని గురువారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు.

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగింది. 150 ఏనుగుల కారిడార్లు గుర్తించి రక్షణ కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 132–142 అడవి ఏనుగులు ఉన్నాయి. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో మానవ–ఏనుగు సంఘర్షణ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటకతో కలిసి చర్యలు చేపట్టాం. కర్ణాటక నుంచి నాలుగు కుంకీలను తీసుకువచ్చి ముసలివాగులో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. కుంకీల సహాయంతో 50కి పైగా సంఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, ఏనుగుల వల్ల జరిగే మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగాం. రాష్ట్ర ప్రభుత్వం 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలు, ఏడు వన్యప్రాణుల అంబులెన్స్‌లను ఏర్పాటుచేసింది. వీటిద్వారా 200కు పైగా వన్యప్రాణులను రక్షించగా, 30కుపైగా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. ఏనుగుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఉద్యమంగా మారాలి" పవన్ పిలుపునిచ్చారు.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

మొదటి పేజీ తరువాయి

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్–1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# వాన నీటిని ఒడిసిపడదాం.. భూగర్భ జలాలను పెంచుదాం

================================

హైదరాబాద్ ఆగస్టు 13 జన తెలంగాణ

- ‘ఇంటింటికో ఇంకుడు గుంత’ లక్ష్యంగా మోతినగర్‌లో జలమండలి అవగాహన ర్యాలీ
- ఎండిపోయిన బోరుబావులను ఇంజెక్షన్ బావులుగా మార్చేందుకు చర్యలు
- 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం

వర్షపు నీటిని సమర్థంగా సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించి, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో మోతినగర్‌లోని కమ్యూనిటీ హాలులో మంగళవారం వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ, సమావేశం నిర్వహించారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (=బౌా), స్థానిక కాలనీ వాసుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**200 అడుగుల లోతుతో రెండు ఇంజెక్షన్ బావులు:**

మోతినగర్‌లో కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఒకటి, సమీపంలోని మల్లారెడ్డి నివాసం పక్కన మరొకటి చొప్పున జలమండలి సాంకేతిక మార్గదర్శకత్వంలో సుమారు 200 అడుగుల లోతుతో రెండు బోరుబావులను ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ ఇంకుడు గుంతలు నిర్మించి, సమీప భవనాల పైకప్పుల నుంచి వచ్చే వర్షపు నీటిని పైపుల ద్వారా వాటిలోకి మళ్లించేలా ఏర్పాట్లు చేశారు. ఈ విధానం ద్వారా వర్షపు నీటిని భూమిలోని లోతైన పొరల్లోకి పంపించి భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం, కాలనీలో బోరుబావుల నీటి లభ్యతను మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశం. తద్వారా భవిష్యత్‌లో నీటి కొరతను తగ్గించడంతో పాటు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన అవసరాన్ని కూడా క్రమంగా తగ్గించవచ్చని జలమండలి అధికారులు వివరించారు. స్థానిక




సయ్యద్ హుస్సేన్ బాబా, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు జలమండలి అధికారులు కాలనీలో పరిస్థితులను పరిశీలించి అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

**80 శాతం ఇళ్లలో రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ లక్ష్యం:**

ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా మోతినగర్ కాలనీలో సుమారు 80 శాతం గృహాల్లో పైకప్పులపై పడే వర్షపు నీటిని రీచార్జ్ నిర్మాణాల్లోకి మళ్లించే వ్యవస్థలు ఏర్పాటు చేసుకునే దిశగా స్థానికులు ముందుకు వస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా వర్షాకాలం అనంతరం కూడా బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు భూగర్భ జలమట్టాన్ని స్థిరంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని భూగర్భ జల నిపుణులు తెలిపారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరానికి మించి బోరుబావులను అధిక లోతులో తవ్వకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.

**ఎండిపోయిన బోరుబావులకు కొత్త జీవం:**

ఈ సందర్భంగా జలమండలి సైబరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ, జలమండలి 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కాలనీల్లోని సామూహిక ప్రదేశాల్లో నిరుపయోగంగా, ఎండిపోయిన బోరుబావులను గుర్తించి వాటిని ఇంజెక్షన్ బావులుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వాటికి అనుసంధానంగా వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసి భూగర్భ జలాల రీచార్జ్‌కు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. కాలనీ వాసులు పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. పచ్చదనం పెరగడం వల్ల వేసవిలోనూ స్థానికంగా ఉష్ణోగ్రతల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చన్నారు. అదే సమయంలో ప్రస్తుతం జలమండలి సరఫరా చేస్తున్న నీటిని పొదుపుగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని కోరారు.

**ప్రతి కాలనీ ముందుకు రావాలి:**

మోతినగర్‌ను స్ఫూర్తిగా తీసుకుని నగరంలోని ఇతర కాలనీలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు కూడా వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జలమండలి అధికారులు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి మళ్లించవచ్చు. తద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చు. వాన నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మల్లారెడ్డి, సుభాష్ పటేల్, షేక్ హుస్సేన్‌తో పాటు ఇతర దాతలు, కాలనీ ప్రతినిధులకు జలమండలి అధికారులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) నారాయణ, డైరెక్టర్ (రెవెన్యూ) కిరణ్‌కుమార్, జీఎంహరిశంకర్, డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ జకీ, భూగర్భ జలనిపుణుడు జాల సత్యనారాయణ, కాలనీ ప్రతినిధులు సయ్యద్ హుస్సేన్ బాబా, మల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు గోపాల్ చౌదరి, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యకు విద్యుత్ శాఖ

- టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో ఘనంగా నిర్వహించిన “బస్తీ బాట” కార్యక్రమం
- బస్తీ బాటలో భాగంగా “వాక్ అలోంగ్ ది లైన్” కార్యక్రమం కొనసాగింపు

హైదరాబాద్, ఆగస్టు 13, జన తెలంగాణ




టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ ఆదేశాల మేరకు సంస్థ పరిధిలోని 21 ఆపరేషన్ సర్కిళ్లలో గురువారం “బస్తీ బాట” కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఫీల్డ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని విద్యుత్ వ్యవస్థల నిర్వహణ పనులను చేపట్టడంతో పాటు వినియోగదారులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీటీఆర్‌ల నిర్వహణ, యార్డుల పరిశుభ్రత, చెట్ల కొమ్మల తొలగింపు, తీగలకు అడ్డుగా పెరిగిన తీగజాతి మొక్కల తొలగింపు, ఏబీ స్విచ్‌ల మరమ్మతులు, ఫీడర్‌ల తనిఖీలు, విద్యుత్ భద్రతా చర్యలు తదితర పనులను విస్తృతంగా చేపట్టారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా “వాక్ అలోంగ్ ది లైన్” కార్యక్రమాన్ని కూడా అధికారులు కొనసాగించారు. ఫీడర్ల వెంట కాలినడకన తనిఖీలు నిర్వహిస్తూ, విద్యుత్ లైన్ల స్థితి, చెట్ల కొమ్మల అడ్డంకులు, వదులైన కండక్టర్లు, దెబ్బతిన్న పరికరాలు, భద్రతా లోపాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ఆగస్టు 20వ తేదీ వరకు అన్ని సర్కిళ్లలో కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో అధికారులు, ఉద్యోగులు, ఫీల్డ్ సిబ్బంది విద్యుత్ భద్రతా ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్ పనుల నిర్వహణలో అన్ని భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించడం, పని ప్రారంభానికి ముందు విద్యుత్ సరఫరాను నిలిపివేసి లైన్ డెడ్‌గా ఉందని నిర్ధారించుకోవడం, సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం, హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, గ్లౌవ్స్, సేఫ్టీ షూస్ వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించడం, తమ భద్రతతో పాటు సహచరుల భద్రతను కూడా కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బస్తీ బాట మరియు వాక్ అలోంగ్ ది లైన్ కార్యక్రమాల ద్వారా విద్యుత్ సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడం, ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టడం వల్ల విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఉద్యోగి “భద్రతే మొదటి బాధ్యత” అనే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. బంజారాహిల్స్ డివిజన్‌తో పాటు అన్ని సర్కిళ్లలో నిర్వహించిన భద్రతా ప్రతిజ్ఞ కార్యక్రమం ఉద్యోగుల్లో భద్రతా అవగాహనను మరింత పెంపొందించిందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ భద్రత, వినియోగదారుల సంతృప్తి, నిరంతరాయ సరఫరా లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. హైదరాబాద్, సైబర్‌సిటీ, సరోర్‌నగర్, రాజేంద్రనగర్, మేడ్చల్, హబ్సిగూడ, పటాన్‌చెరు, సిద్ధిపేట, వికారాబాద్, గద్వాల్ తదితర సర్కిళ్లలో అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ వ్యవస్థల పనితీరును పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వనస్థలిపురం, అంబర్‌పేట్, నారాయణగూడ, హయత్‌నగర్, దమ్మాయిగూడ, బండ్లగూడ, బేగంబజార్, గాంధీనగర్, కుత్బుల్లాపూర్, గుండ్లపోచంపల్లి, ములుగు, దౌలతాబాద్, బాలాపూర్, డీపీ పల్లి, బొంతపల్లి, ఇంద్రేశం, పెద్దేముల్ తదితర ప్రాంతాల్లో డీటీఆర్ నిర్వహణ, యార్డు క్లీనింగ్, చెట్ల కొమ్మల కత్తిరింపు, విద్యుత్ లైన్ల భద్రతా పనులు చేపట్టారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో అధికారులు, ఉద్యోగులు, ఫీల్డ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా సంస్థ నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

# సమర్థ ప్రణాళికతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా

హైదరాబాద్, ఆగస్టు 13 జన తెలంగాణ

- ఎల్‌నినో ప్రభావంతో రికార్డు స్థాయిలో పెరి డిమాండ్‌ను విజయవంతంగా ఎదుర్కొంటున్న టీజీఎస్పీడీసీఎల్
- ప్రభుత్వ ముందుచూపు, సమర్థ ప్రణాళికతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా
- రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ అందజేత

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం లోపించడం, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవడం, వ్యవసాయ రంగం పూర్తిగా విద్యుత్ ఆధారిత సాగు వైపు మళ్లడం వంటి పరిణామాలతో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు భూగర్భ జలాలపై ఆధారపడి మోటార్ల వినియోగాన్ని పెంచడంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ కండిషనర్లు, కూలింగ్ పరికరాల వినియోగం అధికమవడం, పారిశ్రామిక మరియు ఐటీ రంగాల



విస్తరణతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 2026 ఆగస్టు 12న 10,839 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదుకాగా, గత ఏడాది ఇదే రోజున నమోదైన 7,216 మెగావాట్లతో పోలిస్తే 3,623 మెగావాట్ల అధిక డిమాండ్ నమోదైంది. అలాగే విద్యుత్ వినియోగం 207.30 మిలియన్ యూనిట్లకు చేరగా, గత ఏడాది 147.12 మిలియన్ యూనిట్లతో పోలిస్తే 60.18 మిలియన్ యూనిట్ల అదనపు వినియోగం నమోదైంది. అదేవిధంగా క్యూర్ (జఖ=జు) పరిధిలో 2026 ఆగస్టు 12న 3,920 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదుకాగా, గత ఏడాది ఇదే రోజున నమోదైన 3,310 మెగావాట్లతో పోలిస్తే 610 మెగావాట్ల పెరుగుదల నమోదైంది. విద్యుత్ వినియోగం 81.17 మిలియన్ యూనిట్లకు చేరగా, గత ఏడాది 65.49 మిలియన్ యూనిట్లతో పోలిస్తే 15.68 మిలియన్ యూనిట్ల అదనపు వినియోగం నమోదైంది. ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు రైతులు, గృహ వినియోగదారులు, పారిశ్రామిక మరియు వాణిజ్య రంగాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు టీజీఎస్పీడీసీఎల్ వెల్లడించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్,




ఐఏఎస్ మార్గదర్శకత్వంలో విద్యుత్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, అదనపు లోడ్‌ను భరించేలా సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లను బలోపేతం చేయడం, అత్యవసర స్పందన బృందాలను 24 గంటలు అందుబాటులో ఉంచడం, కీలక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసినట్లు పేర్కొంది. “ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన అసాధారణ పరిస్థితుల మధ్య కూడా తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూ, రైతులు మరియు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కట్టుబడి ఉంది. విద్యుత్ డిమాండ్ ప్రతి వారం కొత్త గరిష్ఠాలను నమోదు చేస్తున్నప్పటికీ, సమర్థ ప్రణాళిక, ఆధునిక సాంకేతికత వినియోగం, సిబ్బంది అంకితభావంతో సరఫరాను విజయవంతంగా నిర్వహిస్తున్నాము” అని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం -- విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తూ, ప్రతి వినియోగదారుడి ఇంటికి, ప్రతి రైతు పొలానికి, ప్రతి పరిశ్రమకు నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడంలో ముందంజలో కొనసాగుతోంది.

# రూ.6 లక్షల గంజాయి పట్టివేత..

- 11.7 కేజీల గంజాయి స్వాధీనం.
- ముగ్గురి వ్యక్తుల అరెస్టు.

హైదరాబాద్ ఆగస్టు 13జన తెలంగాణ

ముగ్గురు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉద్యోగులుగా పని చేస్తారు. ఇదే సమయంలో రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పని చేసే ఒరిస్సా కార్మికుడితో గంజాయికి అలవాటు పడ్డారు.

ఒరిస్సా కార్మికుడి సహాయంతో గంజాయిని కొనుగోలుకు మార్గం సుగుమం చేసుకున్నారు. ఇలా ముగ్గురు వ్యక్తులు ఒరిస్సా ప్రాంతంలో గంజాయి అమ్మకాల చోటకు బైక్‌లపై వెళ్లిడం 10 నుంచి 20 కేజీల గంజాయిని తీసుకోని వచ్చి అమ్మకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ డీ టీం సిబ్బందికి 11.7 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. ఎన్టీఆర్ కొత్తపేట ‘రూర్‌నగర్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న క్రమంలో ఎస్టీఎఫ్ డీ టీమ్ సీఐ నాగరాజు



సిబ్బంది కలిసి పట్టుకున్నారు.

గంజాయితో పట్టుబడిన వారిలో ఎలిశాల నవీన్ (22), జాక శికకుమార్ (26), వైద్య జగదీష్ (26) ఉన్నారు.

వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న టూవీలర్‌ను, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, గంజాయిని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

**97గ్రాముల హషీష్ అయిల్, గంజాయి పట్టివేత..**

మేడ్చల్ మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్, సిబ్బంది కలిసి ఎల్‌బీనగర్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే మేరకు నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 97 గ్రాముల హషీష్ అయిల్, 110 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో తోట సాగర్ (34), శ్రీకాంత్ సాగర్ (32) అనే ఇద్దరిని అరెస్ చేశారు. వారి వద్ద ఉన్న కారును, సెల్ ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను, గంజాయి, హషీష్ అయిల్‌ను సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సరూర్‌నగర్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు తెలిపారు.

# నాకు ముప్పుందన్నారు.. అందుకే విమానం మారా: ట్రంప్

వాషింగ్టన్: గత నెలలో తుర్కియే పర్యటన ముగిశాక తనకు ముప్పుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ వన్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా తప్పించుకుని మరో విమానంలో అమెరికా చేరకున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ బెదిరింపునకు తానేమీ భయపడలేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు క్యాటరింగ్ కంటైనర్‌లో దాక్కుని వేరే విమానంలోకి మారి అమెరికాకు ప్రయాణమవడం, అటుపై ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాన్ని తప్పుదోవ పట్టించే డెకాయ్‌గా పంపిన ఘటనను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. అలాగే ఆ సమయంలో తన అధికారిక విమానంలో ప్రయాణించిన శ్వేతసౌధం అధికారులు, భద్రత-సహాయ సిబ్బంది, విలేకరులకు ఎదురయ్యే ప్రమాదాన్ని తక్కువ చేసి చూపారు. “నేను వేరే విమానంలో ప్రయాణించాలని వారు కోరుకున్నారు. అక్కడ ఏదో ఓ ముప్పు ఉందని ఊహించా. అయితే దాని గురించి ఆరా తీయలేదు. నాకు చాలా ముప్పులు ఎదురవుతుంటాయి” అని ట్రంప్ ఒహాయోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన అనంతరం విలేకరులకు తెలిపారు.

**హర్మూజ్‌పై సంపూర్ణ నియంత్రణ అమెరికాదే**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆ



దేశంతో జరుగుతోన్న చర్చలపై తమకు నమ్మకం లేదని.. వారు ఎప్పుడూ తనకు అబద్ధాలే చెబుతారని అన్నారు. హర్మూజ్ జలసంధిపై సంపూర్ణ నియంత్రణ అమెరికాకే ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం జలసంధి తమ అధీనంలోనే ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గినా.. దుందుడుకు చర్యలకు పాల్పడినా కఠిన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు హర్మూజ్ జలసంధిలో ఒమన్ వద్ద ఓ నౌకపై అమెరికా దాడి చేసింది. ఇరాన్ రేవులపై తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. పనామా జెండా కలిగిన ‘వేలా నోవా’ కార్గో నౌకపై నేవీ హెలికాప్టర్ రెండు హెల్‌ఫైర్ క్షిపణులను ప్రయోగించిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాడిలో సిబ్బంది ఎవరైనా గాయపడ్డారా అనే విషయాన్ని వెల్లడించలేదు.

# అమెరికాకు వచ్చిన 600 మంది గర్భిణుల వీసాలు రద్దు



వాషింగ్టన్: బర్త్ టూరిజంపై అమెరికా ఉక్కుపాదం మోపుతోంది. పిల్లలను కనడానికే అమెరికాకు వచ్చే వారిని నియంత్రిస్తోంది. ఒక్క జులై నెలలోనే 9వ నెల గర్భంతో ఉండి అమెరికాకు వచ్చిన 600 మంది వీసాలను రద్దు చేసింది. బర్త్ టూరిజం నిరోధక టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో వీసాలను పరిశీలించి రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. మరోవైపు కఠిన వీసా నిబంధనల కారణంగా అమెరికాకు ఈ ఏడాది వచ్చిన విద్యార్థుల సంఖ్య తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫాల్ సీజన్లో 1.12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు.

RNI NO. TELTEL/2014/61071
# జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# విద్యుత్ సరఫరా నాణ్యత, ఆదాయ వసూళ్లు, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**●ఆపరేషన్ సర్కిళ్ల సమీక్ష అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ,సమావేశం నిర్వహించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్**

హైదరాబాద్/రాజేంద్రనగర్, ఆగస్టు 13, జన తెలంగాణ



టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ సర్కిళ్ల పనితీరు, విద్యుత్ సరఫరా నాణ్యత, ఆదాయ వసూళ్లు, ఫీడర్ అంతరాయాలు, భద్రతా చర్యలు, కొత్త కనెక్షన్ల మంజూరు, ఎనర్జీ ఆడిట్ తదితర అంశాలపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ అధ్యక్షతన నిన్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సర్కిల్‌లో పనితీరు మెరుగుపరచడంతో పాటు ఆదాయ వసూళ్లు, భద్రతా ప్రమాణాల అమలు, ఫీడర్ అంతరాయాల తగ్గింపు, పెండింగ్ పనుల పూర్తి విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రతి సర్కిల్‌లో పనితీరు కనీసం 80 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్యాలకు వెనుకబడిన సర్కిళ్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు.మహబూబ్‌నగర్ జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన మిడ్‌జిల్ మోడల్ సబ్‌స్టేషన్ తరహాలో అన్ని సర్కిళ్లలో కనీసం ఒక సబ్‌స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించిన సీఎండీ, పరిశుభ్రత, భద్రత, హరితవనం, ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సబ్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు, రిమోట్ ఆపరేషన్, ఆటో రీక్లోజర్ వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను విస్తరించాలని ఆదేశించారు.ప్రతి సర్కిల్‌లో యాక్సిడెంట్ ఫ్రీ యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫీడర్ అంతరాయాలపై శాస్త్రీయ విశ్లేషణ నిర్వహించి, పునరావృత అంతరాయాలకు శాశ్వత పరిష్కారాలు అమలు చేయాలని ఆదేశించారు.వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగే సమయాల్లో అత్యవసర పరిస్థితులు మినహా విద్యుత్ అంతరాయాలు కలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని స్పష్టం చేశారు.

### రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ

వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష అనంతరం, క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించేందుకు సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నానల్‌నగర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో డీటీఆర్ వైఫల్యాలు, విద్యుత్ అంతరాయాలు, రెవెన్యూ వసూళ్లు, కొత్త విద్యుత్ కనెక్షన్లు, పెండింగ్ వర్క్ ఆర్డర్లు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా ఎఫ్-క్లాస్ డీటీఆర్ ఫెయిల్యూర్స్ తగ్గించేందుకు ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని, తరచూ అంతరాయాలు ఎదురవుతున్న ఫీడర్లపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.ఎల్టీఎం మరియు ఇతర కేటగిరీలకు సంబంధించిన కొత్త సేవల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు మరియు గేటెడ్ కమ్యూనిటీల్లో కామన్ సర్వీసులకు సింగిల్ కనెక్షన్ విధానాన్ని అమలు చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు.సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని వర్క్ ఆర్డర్లను ఆగస్టు 20 నాటికి పూర్తి చేసి క్లోజ్ చేయాలని స్పష్టం చేసిన సీఎండీ, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తికాకపోతే బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.రెవెన్యూ వసూళ్లు, విద్యుత్ కనెక్షన్లు, ఫీడర్ అంతరాయాలు, డీటీఆర్ ఫెయిల్యూర్స్ తదితర అంశాల్లో పనితీరు సంతృప్తికరంగా లేకపోతే ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏ సమయంలోనైనా ఏ సర్కిల్, డివిజన్ లేదా సెక్షన్‌నైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, క్షేత్రస్థాయిలో పనితీరు ఆధారంగానే అధికారుల పనిని అంచనా వేస్తామని తెలిపారు.సమీక్ష సందర్భంగా పనితీరు అంశాలను పరిశీలించిన అనంతరం, రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్‌ను వికారాబాద్ సర్కిల్ పరిధిలోని దోమ సెక్షన్‌కు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) డా. ఎన్. నర్సింహులు, డైరెక్టర్ (ఫైనాన్స్) చక్రపాణి, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. శివాజీ, డైరెక్టర్ (హెచ్ఆర్ ఁ ఫైనాన్స్) కృష్ణారెడ్డి పాల్గొన్నారు.అలాగే సీఈలు, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఓలు, ఏఏఓలు, ఈఆర్ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా, రాజేంద్రనగర్ సర్కిల్ సమీక్షలో సీఈ (ఆర్ఆర్ జోన్) పాండ్యా నాయక్, ఎస్ఈ రామ్మోహన్, డీఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలి..

**రెవెన్యూ నష్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి..**
**సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్**

హైదరాబాద్ ఆగస్టు 13 జన తెలంగాణ



డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను నివారించడానికి ఎక్సైజ్ యంత్రాంగం నిఘా పెంచాలని సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ అన్నారు.బ్కారీ భవన్ సమావేశ మందిరంలో గురువారం ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఎక్సైజ్ శాఖ ఆదాయానికి నష్టం కలించే వాటిని గుర్తించాలని, వాటిని అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అదేశించారు. వివిధ రూపాల్లో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను రాకుండా అడ్డుకోవాలని, ఈవెంట్ పర్మిషన్లు తీసుకొని ఎన్డీపీఎల్ మద్యం వినియోగంపై తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యల చేపట్టాలని అన్నారు.మరో పక్క లైసన్సీలు నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.లైసన్సీలు నిబంధనల వాయిలెన్స్ చేపడితే ఎవ్వరిని ఉపేక్షించ కూడదన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి, కుత్బుల్లాపూర్, షేర్‌లింగంపల్లి ఈఎస్‌లు పి.ప్రవీణ్, వై. రాధాకృష్ణారెడ్డి తోపాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# 'లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు నేను దాసుడిని': పాక్ మాజీ మంత్రి



పాకిస్థాన్ (ఖుఎఅఖఅ)లోని రాజకీయ నేతలు, ఉగ్రవాదుల మధ్య సంబంధాలు మరోసారి బహిర్గతమయ్యాయి. లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు తాను దాసుడిని అంటూ బహిరంగ వేదికపై మాజీ మంత్రి షేక్ రషీద్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అప్పుడు ఆ వేదికపై లష్కరే కమాండర్, ఇతర ఉగ్రసంస్థల సభ్యులు కూడా ఉన్నారు."నేను హఫీజ్ సయీద్ దాసుడను. నా ఫోన్‌లో హఫీజ్ ఫోన్ నంబర్ దొరకడం వల్లే అమెరికా నుంచి బహిష్కరించారు" అని రషీద్ మాట్లాడారు. అలాగే సయీద్‌కు తన మద్దతు ప్రకటించారు. అంతటితో ఆగకుండా భారత్‌పై అకారణంగా విషంకక్కారు. రషీద్ 2020 నుంచి 2022 మధ్య ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. భారత్‌లో ఉగ్రకార్యకలాపాలకు పాల్పడేవారి గురించి రషీద్ ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. 26/11 ముంబయి దాడికి పాల్పడిన అజ్మల్ కసబ్ చిరునామాను భారత్‌కు చెప్పింది మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అని గతంలో వ్యాఖ్యలు చేశారు. ఇక, హఫీజ్‌ను ఐరాస ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నగరపాలక సంస్థ 23వ డివిజన్ సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**●కొత్తపల్లి 17, 18 డివిజన్లలో అమృత్ 2.0 నిధులతో బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులకు శ్రీకారం**

కరీంనగర్ ఆగస్టు 13 జన తెలంగాణ



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 23వ డివిజన్ సీతారాంపూర్ ప్రాంతంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీతారాంపూర్ ప్రాంతంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి, మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.అనంతరం 17, 18 డివిజన్లకు సంబంధించిన అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులను మేయర్ గారు ప్రారంభించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా చేపట్టుతున్న ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ఆయన అన్నారు. మొక్కల సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా వాటి పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్ గారు, 17, 18వ డివిజన్ కార్పొరేటర్లు శ్రీమతి వేముల కవిత చంద్రశేఖర్ వాసాల రమేష్ , మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# టీకాలతో ట్రంప్ ఆటలు!



వాషింగ్టన్: భారీగా సుంకాల వడ్డింపు, ఇరాన్‌తో యుద్ధం వంటి చర్యలతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను ఇబ్బందుల్లోకి నెట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా ఓ వివాదాస్పద నిర్ణయంతో స్వదేశంలోనూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. అమెరికాలో పిల్లల టీకాల సిఫార్సులు, షెడ్యూళ్లలో మార్పులు చేస్తూ ఆయన కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఈ మార్పులు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత విధానం ప్రకారం- పిల్లలకు వేర్వేరు టీకాలను ఒకేసారి కలిపి ఇచ్చేవారు. దానివల్ల పదేపదే ఆసుపత్రులకు వెళ్లాల్సిన ఇబ్బంది ఉండేది కాదు. అందుకు భిన్నంగా ట్రంప్ నూతన విధానాన్ని ప్రతిపాదించారు.ఇది వేర్వేరు టీకాలను వేర్వేరు విభాగాలుగా విభజించింది. అవన్నీ వేయించుకోవాలంటే పిల్లలను చాలాసార్లు ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అందరు పిల్లలకూ అన్ని వ్యాక్సిన్లు వేయాల్సిన అవసరం లేదనీ కొత్త విధానం స్పష్టం చేసింది. దీని ప్రకారం- తట్టు, గవద బిళ్లలు, రుబెల్లా, డిఫ్తీరియా, టెటానస్, పెర్టుసిస్, పోలియో, హిబ్, న్యూమోకోకల్ వ్యాధి, హెచ్‌పీవీ, ఆటలమ్మ వ్యాక్సిన్లను అందరికీ ఇస్తారు. హెపటైటిస్ ఎ, హెపటైటిస్ బి, ఆర్ఎస్‌వీ, మెనింజోకోకల్ వ్యాధి టీకాలను మాత్రం ముప్పు ఎక్కువగా ఉన్నవారికే అందిస్తారు.

### ఎంఎంఆర్ వేర్వేరుగా..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు తట్టు, గవద బిళ్లలు, రుబెల్లా (ఎంఎంఆర్) వ్యాక్సిన్‌ను కలిపే (ఒకే షాట్‌గా) ఇస్తున్నారు. దాన్ని మూడు వేర్వేరు టీకాలుగా ఇవ్వాలని ట్రంప్ తాజాగా ఆదేశించారు. ఎంఎంఆర్ వేర్వేరు వ్యాక్సిన్లుగా అమెరికా మార్కెట్‌లో లేనే లేదు. వాటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 90 రోజుల గడువు ఇస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

### విమర్శల వెల్లువ

ఎంఎంఆర్ వ్యాక్సిన్ గురించి ట్రంప్ ఇంతకుముందు మాట్లాడుతూ.. మూడు వ్యాధులకు కలిపి ఒకేసారి టీకా వేయడం ప్రాణాంతకమన్నారు. ఆయన వ్యాఖ్య అశాస్త్రీయమంటూ వైద్యులు ఖండించారు. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకపోవడంతో విమర్శలు వెలువడుతున్నాయి. అమెరికాలో టీకా రేట్లు పడిపోతూ తట్టు విజృంభిస్తున్న సమయంలో ట్రంప్ తాజా ఉత్తర్వు తల్లిదండ్రుల్లో భయాందోళనలను, గందరగోళాన్ని సృష్టించొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
కొవిడ్ సమయం నుంచి టీకాల వ్యతిరేక ఉద్యమాన్ని నడుపుతున్న అమెరికా ప్రస్తుత ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెనడీ జూనియర్ అభీష్టం మేరకే టీకాలపై ట్రంప్ ప్రస్తుత ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# దుకాణాలు తొందరగా మూసేయండి..! బంగ్లాలో విద్యుత్ సంక్షోభం



బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని (ఢీఖఅస్త్రశ్రీఖఁవంప్త్ర ్రాశీఃవతీ జతీఅంఅం) ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కరెంటు కోతలు ఎక్కువయ్యాయి. పరిస్థితి చాలా తీవ్రంగా మారడంతో విద్యుత్ వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. షాపింగ్ మాల్స్, మార్కెట్లు, దుకాణాలు రాత్రి 8గంటల వరకే తెరచి ఉంచాలని ఆదేశించింది. ఇదే సమయంలో తమకు అదనంగా డీజిల్ సరఫరా చేయాలని భారత్‌ను సాయం కోరింది. ఇదే విషయంపై బంగ్లాదేశ్‌లోని భారత రాయబారి దినేశ్ త్రివేదితో ఇటీవల జరిగిన భేటీలో చర్చించింది.రాజధాని ఢాకా మినహా అన్ని ప్రాంతాల్లో నిత్యం ఎనిమిది నుంచి 10 గంటలపాటు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. దీంతో పరిశ్రమలు దెబ్బతినడంతోపాటు రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్ర ఆగ్రహానికి గురవుతున్న స్థానికులు.. విద్యుత్ కేంద్రాలపై దాడులకు దిగుతున్నారు. దీంతో గ్రిడ్‌లు, సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలకు పోలీసులు భద్రత కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక మీడియా పేర్కొంది.బంగ్లాదేశ్ తన ఇంధన అవసరాల కోసం చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడింది. ఇటీవల గ్యాస్ కొరత వల్ల దాదాపు 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కొన్ని రోజుల క్రితం అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో అది మూతపడింది. విద్యుత్ కోతలతో (గ్రాశీఃవతీ ఎఛ్ం) రైతులు డీజిల్ మోటార్లపైనే ఆధారాపడాల్సిన పరిస్థితి నెలకొంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న టెక్స్‌టైల్స్, గార్మెంట్ రంగం కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆసుపత్రులు, రెస్టారెంట్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

# రష్యాలోకి 1,300 కి.మీ. చొచ్చుకెళ్లి.. కీలక రిఫైనరీపై దాడి చేసి



రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పరస్పర దాడులు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలోనే రష్యాలోకి చొచ్చుకెళ్లిన ఉక్రెయిన్ డ్రోన్లు.. సరిహద్దుకు దాదాపు 1,300 కి.మీల దూరంలో ఉన్న ఓ కీలక రిఫైనరీపై దాడులు చేశాయి. మాస్కో చమురు పరిశ్రమను దెబ్బతీయడమే లక్ష్యంగా.. మూడు రోజుల్లో చేపట్టిన నాలుగో దాడి ఇది. మరోవైపు.. క్రిమియాలోని సెవస్తోపోల్‌లో పేలుడు పదార్థం పేలి రష్యాకు చెందిన నలుగురు నిపుణులు, ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందారు."రష్యా (=బంంఖు)లోని బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లో ఉన్న గ్యాజ్‌ప్రోమ్ నెఫ్తెఖిమ్ సలావత్ చమురు శుద్ధి, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై డ్రోన్లతో దాడులు చేశాం. ఫలితంగా ఆ ప్రాంగణంలో మంటలు చెలరేగాయి. ఉక్రెయిన్ సరిహద్దుకు దాదాపు 1,300 కి.మీ. దూరంలో ఉన్న ఈ కాంప్లెక్స్.. రష్యాలోని అతిపెద్ద రిఫైనరీల్లో ఒకటి. ఏటా దాదాపు 7.4 కోట్ల బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తోంది" అని ఉక్రెయిన్ సైన్యం పేర్కొంది. ఇదే ప్రాంతంలోని తమ గోదాంలోనూ మంటలు చెలరేగాయని రష్యాలోని అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ వైల్డ్‌బెర్రీస్ ప్రకటించింది. అయితే, అక్కడ సరకులేమీ నిల్వ లేవని పేర్కొంది. రష్యా సైతం ఉక్రెయిన్ (ఖనెఖీఅఅవ)పై బాలిస్టిక్ క్షిపణులు, జెట్ డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడుతోంది. బుధవారం నుంచి గురువారం రాత్రి వరకు ఉక్రెయిన్ వ్యాప్తంగా 133 డ్రోన్లతో జరిపిన దాడుల్లో నలుగురు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. దక్షిణ ఒడెసాలో ఓ ప్రయాణికుల రైలుపై జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు మృతి చెందారని రైల్వే అధికారులు తెలిపారు.

### క్షిపణులు ఇవ్వండి..: జెలెన్‌స్కీ

రష్యా క్షిపణులను తిప్పికొట్టేందుకు.. అమెరికా తయారు చేస్తున్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమకు ప్రస్తుతం అత్యంత అవసరమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ (ఎశీశ్రీశీఎఎవీ్గవశ్రీవఅంఎఎ) పేర్కొన్నారు. 2025తో పోలిస్తే ఈ ఏడాది తమ వద్ద రెండున్నర రెట్లు తక్కువ పేట్రియాట్‌లు ఉన్నాయని చెప్పారు.

## ఉక్రెయిన్ నగరాలపై రష్యా దాడులు.. 10 మంది మృతి

కీవ్: క్షిపణులు, డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో ఉక్రెయిన్ నగరాలపై మంగళవారం రష్యా విరుచుకుపడింది. ఈ దాడుల్లో దాదాపు 10 మంది ఉక్రెయిన్ పౌరులు మృతి చెందారని, 24 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. కాగా.. ఉత్తర కొరియా నుంచి రష్యా సైనిక సహాయాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా బలగాలకు ఉత్తర కొరియా నుంచి క్షిపణులు సరఫరా అవుతున్నట్లు తెలిపారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 14, 2026

# జర్నలిస్టులకు భద్రత టీయూడబ్ల్యూజే (ఐజేయు)తోనే సాధ్యం !



▶జిల్లా అధ్యక్షుడు యాదగిరి ని అభినందించిన రాష్ట్ర అధ్యక్షుడు
▶నియోజకవర్గం కమిటీల ఏర్పాటుపై హర్షం
▶త్వరలో ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు.

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు( టీయూడబ్ల్యూజే- ఐజేయు) ద్వారానే జర్నలిస్టుల కు భద్రత సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తో ఇప్పటికే అనేక దఫాలుగా చర్చలు జరిగాయని, త్వరలో హెల్త్ కార్డు లు వస్తాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ, పటాన్ చేరు నియోజకవర్గం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో గురువారంహైదరాబాదులోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. గజమాలతో , శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లామహాసభను క్రమశిక్షణతో భారీ ఎత్తున నిర్వహించినందుకు జిల్లా కమిటీని అభినందించారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు బండారు యాదగిరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పటాన్చెరు నియోజకవర్గ కమిటీ ఏర్పాటుపై హర్షం వెలిబుచ్చారు.టి యు డబ్ల్యు జె-ఐ జే యు మొక్కుబడి యూనియన్ కాదు అని, 70 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సంఘం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక సంఘం అని చెప్పారు. అక్రిడేషన్ కార్డులు ఇప్పటికే చాలా మందికి వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలో వస్తాయని చెప్పారు.అంతే కాకుండా అర్హులైన వారికి ఇంటి స్థలాలకు సంబంధించి త్వరలో ప్రభుత్వం ఒక పాలసీని తెస్తుందని తద్వారా అందరికీ ఇట్టి స్థలాలు వస్తాయని వివరించారు.పాత్రికేయులలో వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లా మహాసభను అందరి సహకారంతోనిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క రిపోర్టర్ కూడా తమ సొంత ఫంక్షన్ లాగా భావించి జిల్లా మహాసభకు తరలివచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల సంక్షేమానికి పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తామని చెప్పారు. పటాన్చెరు మాదిరిగానే జిల్లాలో ని మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతను సాధించడం ద్వారా హక్కులను పొందడమే తమ ముందున్న కర్తవ్యం అని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ సూచనలు సలహాలతో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ



సంఘం తలపెట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయం చేసుకోవడం ద్వారా సంఘం కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర నాయకుడు బాసిత్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రతి విషయంలోటియుడబ్ల్యూజేఐజేయు అండగా నిలిచిందని అన్నారు. సంఘం పిలుపును పూచే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను సమిష్టిగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమాల వల్ల ప్రతి జర్నలిస్టుకు ఉత్సాహం కలుగుతోందని చెప్పారు. చిన్న మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు కూడా పోరాట పటిమ ను సాధించాలంటే టీయూడబ్ల్యూజేఐజేయు చరిత్ర తెలుసుకుంటే సరిపోతుందన్నారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా టియుడబ్ల్యూజే పని చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గం అధ్యక్షుడు పత్తి నరసింహ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు గర్వపడే విధంగా పటాన్చెరు నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా పాలువురు జర్నలిస్టులుజిల్లా అధ్యక్షుడు యాదగిరికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు.జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్,జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ,జిల్లా నాయకులు భూపాల్ రెడ్డి, హిమాయత్, పటాన్చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు

# రైల్వే ట్రాక్ పైకి వెళ్లొద్దు.. ఆవేశంలో నిర్ణయాలు వద్దు. మక్తల్ పోలీస్.



నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గశీ. జక్లేర్ గ్రామం.కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని మక్తల్ పోలీసులు సమయస్ఫూర్తితో కాపాడారు. జక్లేర్ గ్రామానికి చెందిన నరసింహ చనిపోతానని భార్యకి ఫోన్ చేయడంతో ఆమె. బుధవారం. రాత్రి 11 గంటలకు పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై రాజు ఆదేశాలతో బ్లకోల్ట్ సిబ్బంది అప్రమత్తమై, రైల్వే ట్రాక్ పై ఉన్న అతడిని సురక్షితంగా రక్షించి కుటుంబానికి అప్పగించారు. పోలీసుల స్పందనను పలువురు అభినందించారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా డైరెక్టర్ ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా కి మర్యాదపూర్వక సన్మానం..



నారాయణపేట జిల్లా గురువారం. మధ్యాహ్నం మూడు గంటలకు సాయిబాబా ని కలిసి సమాజ సేవలో వారు కూడా పాల్గొనాలని మరియు వారు సేవలందించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలోకన్యకా పరమేశ్వరి ఆలయ ఆలయ పునర్నిర్మాణ అధ్యక్షులు పూరి బసవరాజు పట్టణ కార్యదర్శి బొద్దు శివప్రసాద్ వర్ని బాలకృష్ణ రాష్ట్ర రైతు సంగం నాయకుడు వెంకోబా పట్టణ మాజీ కార్యదర్శి రఘునాథ్ గుప్తా పాల్గొనడం జరిగింది

# సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలు కొనసాగుతాయి: యూఎస్పీసీ

విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలను పరిష్కరించేంత వరకు నిరసన పోరాటాలు కొనసాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) నాయకులు మునిగడప రామాచారి, సోడె విజయకుమార్ తెలిపారు. యూఎస్పీసీ రెండో దశ పోరాట కార్యాచరణలో భాగంగా భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంఎదుట నిరసన చేపట్టి, తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు కూడా విద్యారంగ సమస్యలేనని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రతినెల వందలాది మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల మూసివేత ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యలో అసమానతలను తొలగించి నాణ్యమైన విద్య





అందించడంతో పాటు ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచి తరగతి గది బోధనకు పరిమితం చేయాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు, సమాజంలో విశ్వాసం పెంచే చర్యలు చేపట్టాలని, ప్రైవేటు కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే విధానాలను విరమించుకోవాలని అన్నారు. మూడేళ్లు గడిచినా పీఆర్సీ అమలు చేయకపోవడం, కేంద్రం డీఏ ప్రకటించినప్పటికీ రాష్ట్రంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటం, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగుల ఇతర బకాయిల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు.విద్యారంగం, పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధించిన సుమారు 29 సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లెల సత్యనారాయణ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, కె. శ్రీనివాస్, టీపీటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. బాబురావు, బి. రఘునందన్ సింగ్, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రక్తదాన శిబిరానికి కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ, త్రీటౌన్ సీఐ ఏ. ఇంద్రసేనారెడ్డి, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు ట్రాఫిక్ ఎస్ ఐ ప్రవీణ్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ అధ్యక్షులు జెబి బాలు, జిల్లా ప్రతినిధులు జుబ్బు, రాజేష్ పాల్గొన్నారు.

# నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాలనుఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి.

సంగారెడ్డి పట్టణంలో మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నెల 15న సంగారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను సీఎం ఆవిష్కరించనున్నారు.విగ్రహావిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి అధికారులతో కలిసి విగ్రహాల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో



చేపట్టాలని జగ్గారెడ్డి, నిర్మల అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో సీఎం వెంట పాల్గొనే నాయకులు, ప్రజాప్రతినిధుల వివరాలను కూడా అధికారులకు తెలియజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్



నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు రఘుగౌడ్, జార్జ్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్, ప్రవీణ్, సందీప్‌రెడ్డి, మొగులయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో ఈ నెల 18న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 8:00 గంటలకు చర్ల స్టేడియం,గ్రానా స్కూల్ రోడ్లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. మహీధర్ తెలిపారు.ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆగస్టు 26, 27 తేదీలలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్కు జిల్లా తరఫున ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఎంపిక పోటీలను అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించనున్నారు. ఇందులో 60 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 18వ తేదీన ఉదయం 8:00 గంటలకు చర్ల స్టేడియంలో అథ్లెటిక్స్ కోచ్ జె. గిరి ప్రసాద కు రిపోర్ట్ చేయాలని కోరారు.మరిన్ని వివరాల కోసం అథ్లెటిక్స్ కోచ్ జె. గిరి ప్రసాద్‌ను 85220 67157 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# తిరంగా ర్యాలీ లో పాల్గొన్న ప్రముఖ నాయకులు

స్వాతంత్ర సమరయోధుల ను స్మరించుకునేందుకు , మన దేశభక్తిని , ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు మన కేంద్ర ప్రభుత్వం , మన ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు గచ్చిబౌలి డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నానక్ రామ్ గూడ నుండి గోపనపల్లి వరకు చేపట్టిన తిరంగా ర్యాలీ లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన జాతీయ జెండా మన 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవానికి, స్వాతంత్రం కోసం ఎందరో సమరయోధుల త్యాగానికి, మన ఐక్యతకు ప్రతీక అని తెలుపుతూ, మన ప్రధాని నరేంద్ర మోదీ గారు మనం ప్రతి పండగ ప్రతి ఇంటిలో ఎలా చేసుకుంటామో స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా ప్రతి ఇంట్లో ఒక పండుగలా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగిందని, మనం ప్రతి ఇంటిపై మన తిరంగా ఎగరవేయడం వల్ల పిల్లల్లో



చిన్ననాటి నుంచే దేశం పట్ల భక్తి, గౌరవం, బాధ్యత పెరుగుతాయన్నారు, స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడానికే ఇదొక గొప్ప అవకాశమని, అలాగే సరిహద్దుల్లో ఎండనక, వాననక రాత్రింబవళ్లు మనల్ని కాపాడుతున్న సైనికులకు గౌరవప్రదంగా వందనం సమర్పించే వేదిక ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమమన్నారు, అలాగే మనకు కావలసిన వస్తువులను మనమే తయారు చేసుకుందాం, మన వస్తువులనే వాడుదాం, వికసిత్ భారత్ లో ప్రతి ఒక్కరం



భాగస్వాములవుదామని పిలుపునిచ్చారు, ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరూ మన ఇళ్లపై, వ్యాపార సంస్థలపై జాతీయ జెండాను ఎగురవేసి.. మన దేశభక్తిని ప్రపంచానికి తెలియజేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్, డివిజన్ అధ్యక్షులు శివా సింగ్, సీనియర్ నాయకులు వసంత్ కుమార్ యాదవ్, స్వామి గౌడ్, లక్మన్, నరేందర్ యాదవ్,దయాకర్, కిషన్ గౌలి, తిరుపతి, ప్రకాష్, సూర్య, లక్ష్మణ్, బబ్లూ సింగ్, రాజు, దినేష్ యాదవ్,రాకేష్, ఆసవరి అంబన్, ప్రసాద్, శేఖర్, సుమన్, శ్రీశైలం, రవీంద్ర ,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మెమోరాండం




లక్ష్మీదేవిపల్లి మండలంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూఎస్పీసీ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి. తావూరియా, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షురాలు బి. లక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వరరావు, టీఎస్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. మోహన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరభద్రు, కృష్ణ, జిల్లా కార్యదర్శి బి. మోతిలాల్‌తో పాటు హరిదాస్, కె. నాగలక్ష్మి, బాలాజీ, శంకర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

